ఎడాపెడా రైటాఫ్‌లు

మొండి బకాయిల ఊబిలో భారతీయ బ్యాంకింగ్ రంగం కూలబడింది.

గడిచిన పదేండ్లలో ఆయా బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల విలువ రూ.12 లక్షల కోట్లపైనే మరి.

పార్లమెంట్ సాక్షిగా నరేంద్ర మోదీ సర్కారు చేసిన ఈ ప్రకటన.. దేశంలో బ్యాంకుల అవస్థలకు అద్దం పడుతున్నదిప్పుడు.

పదేండ్లలో రూ.12.3 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేసిన బ్యాంకులు

ఒక్క ఏడాదిలోనే రూ.2.4 లక్షల కోట్ల లోన్లు తొలగింపు

అగ్రస్థానంలో నిలిచిన సర్కారీ బ్యాంక్ ఎస్బీఐ

పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: భారతీయ బ్యాంకింగ్ రంగం మెడకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ లేదా మొండి బకాయిలు) గుదిబండలా తయారయ్యాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రధానమైన వాణిజ్య బ్యాంకులు గత పదేండ్లలో వదిలించుకున్న ఎన్‌పీఏల తీరే ఇందుకు నిదర్శనం. కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు కొలువుదీరిన దగ్గర్నుంచి ఏకంగా రూ.12 లక్షల కోట్లకుపైగా లోన్లను బ్యాంకర్లు రైటాఫ్ చేశారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరం వరకు దేశీయ కమర్షియల్ బ్యాంకులు రూ.12.3 లక్షల కోట్ల రుణాలను ఖాతా పుస్తకాల నుంచి తొలగించినట్టు తాజాగా పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

రూ.6.5 లక్షల కోట్లు

గడిచిన ఐదేండ్లలో బ్యాంకుల్లో జరిగిన రైటాఫ్‌ల్లో అత్యధికం ప్రభుత్వ బ్యాంకులు చేసినవే కావడం గమనార్హం. ఏకంగా రూ.6.5 లక్షల కోట్ల లోన్లను ఎన్‌పీఏలుగా నిర్ధారించి ఖాతా పుస్తకాల నుంచి తీసేశాయి. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) బ్యాంకు రుణాల్లో ఒక శాతం రైటాఫ్‌ల కిందికే పోయాయి. ఈ నేపథ్యంలోనే కొత్త రుణాల్లో ప్రభుత్వ బ్యాంకుల వాటా 51 శాతానికి పడిపోయింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022-23) ఇది 54 శాతంగా ఉన్నది. మరోవైపు ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరునాటికి ప్రభుత్వ బ్యాంకుల మొత్తం రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు 3.01 శాతానికి పెరిగాయి. ప్రైవేట్ బ్యాంకుల్లో ఇవి 1.86 శాతమే.

ఎస్బీఐ టాప్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ).. లోన్ రైటాఫ్‌ల్లో టాప్‌లో ఉన్నది. గత పదేండ్లలో ఎస్బీఐ తమ ఖాతా పుస్తకాల నుంచి తీసేసిన రుణాల విలువ రూ.2 లక్షల కోట్లుగా ఉన్నది. ఆ తర్వాత పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.94,702 కోట్లతో కొనసాగుతున్నది. కాగా, లోన్ రైటాఫ్ అంటే రుణాలను తీసుకున్నవారిని పూర్తిగా వదిలేయడం కాదని, వారి నుంచి రుణ బకాయిలను వసూలు చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి చెప్తున్నారు. రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుందని అంటున్నారు. అయితే ఇచ్చిన రుణం, దానిపై వడ్డీ మొత్తాల్లో ఎంతో కొంతే చివరకు తిరిగొస్తుందని, కొన్ని కేసుల్లో బ్యాంకులు పెద్ద ఎత్తున నష్టపోయిన సందర్భాలూ ఉంటున్నాయని బ్యాంకింగ్ ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. కోర్టులు, డెట్ రికవరీ ట్రిబ్యునళ్లు, సెటిల్మెంట్లు ఇలా అనేక ఖర్చుల్ని బ్యాంకులు భరించాల్సి వస్తున్నదని కూడా గుర్తు చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సామాన్యులు, సగటు వేతన జీవులు, చిరు వ్యాపారులు రుణాల కోసం వెళ్తే లక్ష ప్రశ్నలతో, సవాలక్ష విచారణలు, పరిశీలనలు చేస్తున్న బ్యాంకులు.. కార్పొరేట్లకు మాత్రం రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. అడిగిందే ఆలస్యం కోట్ల రూపాయల్లో లోన్లను మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వాలు సైతం ఇందుకు వంత పాడుతున్నాయి. చివరకు తీర్చలేమని వారు చేతులెత్తేస్తే.. దివాలా ముసుగులో బ్యాంకర్లూ ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నది. అవును.. బ్యాంకులు రైటాఫ్ పేరిట ఖాతా పుస్తకాలను క్లీన్ చేసుకుంటున్న రుణాల్లో బడా వ్యాపార, పారిశ్రామిక వేత్తలు, కార్పొరేట్లు పొందిన రుణాలే ఎక్కువ మరి. నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా తదితర కేసులే ఇందుకు ఉదాహరణ. బ్యాంకులను మోసం చేసి వేల కోట్ల రూపాయల రుణాలను తీసుకుని వీరంతా దేశం విడిచి పారిపోయిన సంగతి విదితమే. ఈ కేసులను సీబీఐ, ఈడీలు విచారిస్తుండగా.. విదేశీ కోర్టుల్లో న్యాయం కోసం పోరాడాల్సిన దుస్థితి నెలకొన్నది.

గడిచిన ఐదేండ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకుల రైటాఫ్‌లు *(రూ.కోట్లలో)*



- **2018-19లో గరిష్ఠంగా రూ.2.4 లక్షల కోట్ల రుణాల రైటాఫ్.**
- **2023-24లో 1.7 లక్షల కోట్లు.**
- **కొత్తగా రుణాలనిచ్చేందుకు వెనుకాడుతున్న ప్రభుత్వ బ్యాంకులు.**
- **ఈ సెప్టెంబర్ 30నాటికి పీఎస్‌బీల జీఎన్‌పీఏ రూ.3,16,331 కోట్లు.**
- **ప్రైవేట్ బ్యాంకుల్లో 1,34,339 కోట్లే.**
- **ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య ప్రభుత్వ బ్యాంకుల లోన్ రైటాఫ్ రూ.42,000 కోట్లు.**

ఎగుమతులు బెదుర్స్

నవంబర్‌లో 5 శాతం తగ్గిన ఎక్స్‌పోర్ట్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: దేశీయ ఎగుమతులు మళ్లీ నీరసించాయి. అక్టోబర్ నెలలో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్న ఎగుమతులు ఆ మరుసటి నెలలో ప్రతికూలానికి పడిపోయాయి. గత నెలలో ఎగుమతుల్లో వృద్ధి మైనస్ 4.85 శాతం తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 27 శాతం ఎగబాకి 69.95 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. వంటనూనెలు, ఎరువులు, పసిడి, వెండి దిగుమతులు పుంజుకోవడంతో వాణిజ్యలోటు చారిత్రక గరిష్ఠ స్థాయి 37.48 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఈ సందర్భంగా వాణిజ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ మాట్లాడుతూ..చమురు ధరల్లో హెచ్చుతగ్గులు కారణంగా ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయన్నారు. గత నెలలో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు 50 శాతం తగ్గి 3.71 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. చమురేతర ఉత్పత్తుల ఎగుమతులు రికార్డు స్థాయికి చేరుకున్నాయని, దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎగుమతులు 800 బిలియన్ డాలర్లు అధిగమించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు.

పసిడి దిగుమతులు హైజంప్

పసిడి దిగుమతులు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గత నెలలో భారత్ 14.86 బిలియన్ డాలర్ల విలువైన పసిడి దిగుమతైంది. క్రితం ఏడాది ఇదే నెలలో చేసుకున్న 3.44 బిలియన్ డాలర్లతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగింది. ముఖ్యంగా పండుగ సీజన్‌తోపాటు పెళ్లిళ్ల సీజన్ కూడా తోడవడంతో బంగారానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నదని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 49 శాతం ఎగబాకి 49 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది ఇది 32.93 బిలియన్ డాలర్లుగా ఉన్నది. బంగారం 25 శాతం వార్షిక రిటర్నులు పంచింది. ప్రస్తుతేడాది అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఆస్తులు ఇదే కావడం విశేషం. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, బ్యాంకుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం, పుత్తడిపై దిగుమతి సుంకాలు తగ్గించడం కూడా డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది. ప్రస్తుతేడాది బంగారం ధర 23 శాతం ఎగబాకి రూ.78,350కి చేరుకున్నది.

- **ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 2.17 శాతం పెరిగి 284.31 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 8.35 శాతం ఎగబాకి 486.73 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.**
- **దీంతో వాణిజ్యలోటు 202.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అంతక్రితం ఏడాది ఇది 170.98 బిలియన్ డాలర్లు.**
- **గత నెలలో సర్వీసుల ఎగుమతులు 28.11 బిలియన్ డాలర్ల నుంచి 35.67 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.**
- **క్రూడాయిల్ దిగుమతులు 7.9 శాతం అధికమై 16.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.**

చుట్టుముట్టిన ఫెడ్ భయాలు

సెన్సెక్స్ 385, నిఫ్టీ 100 పాయింట్ల పతనం

ముంబై, డిసెంబర్ 16: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాలోకి జారుకున్నాయి. ఈ వారంలో వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వు నిర్ణయం తీసుకునే అవకాశం ఉండటంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా ఐటీ, మెటల్ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో సెన్సెక్స్ 82 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. వీటికి తోడు చైనా ఆర్థిక వ్యవస్థ మరింత బలహీనపడుతుండటం, రూపాయి మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో మదుపరుల్లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఒక దశలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 384.55 పాయింట్లు కోల్పోయి 81,748.57 వద్ద స్థిరపడింది. మరో సూచీ నిఫ్టీ 100 పాయింట్లు కోల్పోయి 24,668.25 వద్ద ముగిసింది. ఆసియా, యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లోకి జారుకోగా, అమెరికా ఫెడ్ సమావేశం నిర్ణయం కోసం మదుపరులు వేచి చూసే ధోరణి అవలంభించడం వల్లనే సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో టైటాన్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌యూఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు నష్టపోయాయి.

AUXILO®
The next level beckons

ఆక్సిలో భారీ వృద్ధి

హైదరాబాద్, డిసెంబర్ 16: విద్యా రుణాలు అందించే ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ ఆక్సిలో.. తెలుగు రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. గడిచిన మూడేండ్లలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో 50 శాతం వృద్ధిని సాధించినట్లు, దీంతో ఇక్కడ మరిన్ని టచ్‌పాయింట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నదని కంపెనీ సీబీవో శ్వేత గురు తెలిపారు. తెలుగు రాష్ట్రాల నుంచి విదేశాలకు వెళ్లిన విద్యార్థుల్లో 65 వేల మందికి రుణం ఇచ్చినట్లు, వీరు రూ.35-65 లక్షల వరకు లోన్ తీసుకొన్నట్లు చెప్పారు.

రూపీ @84.91

- **ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ**
- **మరో 11 పైసలు పతనం**

ముంబై, డిసెంబర్ 16: రూపాయి విలువ మరింత క్షీణించింది. సోమవారం ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపీ మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారింది. ఈ ఒక్కరోజే మరో 11 పైసలు పడిపోయి మునుపెన్నడూ లేనివిధంగా 84.91 స్థాయికి పతనమైంది. పెరిగిన అమెరికా బాండ్ ఈల్డ్స్, దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్.. రూపీని కూలదోశాయని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. ఇక ఉదయం ఆరంభంలో రూపీ ట్రేడింగ్ 84.83 వద్ద మొదలైంది. ఈ క్రమంలోనే ఒకానొక దశలో 84.93 స్థాయికి తగ్గింది. అయితే చివర్లో కాస్త కోలుకొని 84.91 వద్ద స్థిరపడింది. శుక్రవారం కూడా రూపాయి 8 పైసలు కోల్పోయి రికార్డు స్థాయిలో 84.80 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. కాగా, గతకొద్ది రోజులుగా ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్ ముందు రూపాయి వెలవెలబోతూనే ఉన్నది. దీంతో దేశీయ దిగుమతులు భారంగా మారుతున్నాయి. పరిస్థితులు మరింత దిగజారకుండా రిజర్వ్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

తగ్గిన బంగారం మెరుపులు

మరో రూ.1,150 దిగిన తులం ధర

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: బంగారం ధరలు క్రమంగా దిగొచ్చాయి. దేశీయంగా పెళ్లిళ్ల సీజన్ ముగియడం, స్టాకిస్టులు, రిటైలర్లు అమ్మకాలకు మొగ్గుచూపడంతో వరుసగా రెండోరోజు సోమవారం కూడా ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,150 తగ్గి రూ.79 వేల దిగువకు పడిపోయి రూ.78,350 వద్ద ముగిసింది. అంతకుముందు ఇది రూ.79,500గా ఉన్నది. బంగారంతో పాటు వెండి కూడా తగ్గింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి రూ.300 దిగి రూ.92,500గా నమోదైంది. గత రెండు సెషన్లలో కిలో వెండి ఏకంగా రూ.4,500 తగ్గినట్లు అయింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ నూతన ఆర్థిక సంస్కరణలతో కొనుగోలుదారుల్లో అనిశ్చిత పరిస్థితి నెలకొన్నదని, దీంతో అమ్మకాలకు మొగ్గుచూపడం ధరలు తగ్గాయని ట్రేడర్ వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,678.50 డాలర్లకు చేరుకోగా, వెండి 31.11 డాలర్ల వద్ద ఉన్నది.

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

మంత్రుల కోసం కొత్త మంచాలు?

కోడెలు కబేళాలకు తరలింపుపై

'ఆది' మాట్లాడరేం?

- **కోడెల వ్యవహారంలో ఎమ్మెల్యే మౌనం అంగీకారమేనా!**
- **ఆయనకు ఫొటోలు దిగడంలోనే శ్రద్ధ.. ఆలయ అభివృద్ధిపై లేదు**
- **బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

వేములవాడ, డిసెంబర్ 16: రాజన్న కోడెల వ్యవహారంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ మౌనం.. కబేళాకు విక్రయించడం అంగీకారమేనా..? అని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రశ్నించారు. సోమవారం వేములవాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఫొటోలు దిగడంలో ఉన్న శ్రద్ధ ఆలయ అభివృద్ధి, భక్తుల మనోభావాలపై లేదని విమర్శించారు. రాజన్న ఆలయ కోడెలు కబేళాలకు తరలిస్తున్నా, మంత్రి కొండా సురేఖ అనుచరులకు కట్టబెట్టిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారినా ఎందుకు మాట్లాడలేదో చెప్పాలని నిలదీశారు. వరంగల్ జిల్లా గీసుకొండ పరిధిలోని ముగ్గురికి 33 మంది రైతుల పేరిట పంపిణీ చేసిన 66 కోడెల వ్యవహారం బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వీటిలో 28 జీవాలను కబేళాలకు అమ్మడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో రైతులకు ఇచ్చామన్న 1,734 కోడెలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల వేములవాడ పర్యటన సందర్భంగా భోజనాల కోసం రూ.32లక్షలు బిల్లు చేశారని, ఒక్కో ప్లేటుకు రూ.32 వేలు ఖర్చు చేయడం ప్రపంచంలో ఎక్కడా చూడలేదని చెప్పారు. రూ.2కోట్లను ఆలయం నుంచి చెల్లించాలనడం విడ్డూరమని ఎద్దేవాచేశారు.

ఈవో, అధికారులపై చర్యలు తీసుకోవాలి

కోడెలను అమ్ముకున్న మాదాసు రాంబాబుపై కేసు నమోదుకావడంతో ఆలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రాన్ని అందజేశారు.

మొదటిపేజీ తరువాయి...

బిల్లులు దేవాలయ అధికారులకు అందగా, అదే వేగంతో ఫర్నిచర్ కొనుగోలు చేసినట్టు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి విడిది చేసే గెస్ట్ హౌస్‌తోపాటు మంత్రులు విడిది చేసే చైర్మన్ అతిథి గృహంలోని మంచాల నుంచి సోఫాల వరకు ఆగమేఘాల మీద కొత్తవి కొనుగోలు చేశారు. ఈ కారణంగానే ఖర్చు తడిసి మోపెడైనట్టు తెలుస్తున్నది. ఇది రాజన్న దేవాలయానికి భారంగా మారిందనే విమర్శలొస్తున్నాయి. ఇంత ఖర్చు చేసినా ఏ ఒక్కరూ అక్కడ బసచేయలేదు. నిజానికి అక్కడ బస చేస్తున్నట్టు అధికారిక సమాచారం కూడా ఆలయ అధికారులకు అందలేదు. అయినా, ఈ ఫర్నిచర్ ఎందుకు కొనుగోలు చేశారన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'ప్లేట్ భోజనం రూ.32 వేల'కు సంబంధించిన కథనంపై డీపీఆర్వో ద్వారా ఆలయ అధికారులు అస్పష్ట వివరణ ఇచ్చారు. అసలు భోజనాలకు రూ.32 లక్షలు ఖర్చు అయిందా.. లేదా..? అన్న అంశాన్ని పేర్కొనకుండా, కథనంలోలేని అంశాలకు వివరణ ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మంత్రుల కోసం కొత్తమంచాలు?

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వేములవాడకు వచ్చారు. ఈ సందర్భంగా దేవాలయ చైర్మన్ అతిథి గృహంలో సీఎంతో పాటు మంత్రులు, అధికారులు, ఇతర వీపీఐలకు ఏర్పాటు చేసిన భోజనానికి ప్లేట్‌కు రూ.32వేల చొప్పున ఖర్చు పెట్టిన విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలంటూ సోషల్‌మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేశారు. ఈ కథనంపై బీఆర్ఎస్, బీజేపీ భగ్గుమన్నాయి. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. నిజానికి ఆరోజు ముఖ్యమంత్రి సభ మధ్యాహ్నం ఉన్నది. దానికి ముందుగానే సీఎంతోపాటు మంత్రులు కూడా వేములవాడకు చేరుకున్నారు. రాజన్న దర్శనం చేసుకొని, ఆ తర్వాత జరిగిన సభలో పాల్గొని అతిథులు వెళ్లిపోయారు. అధికారిక షెడ్యూల్‌లో ఎక్కడ దేవాలయ పరిధిలో బస చేస్తారని పేర్కొనలేదు. కానీ, ఒక ఉన్నతాధికారి ఆదేశాల మేరకు హుటాహుటిన లక్షలు వెచ్చించి దేవాలయ అధికారులు కొత్త ఫర్నిచర్ కొనుగోలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విడిదిచేసే ఎన్టీఆర్ గెస్ట్‌హౌస్‌లో వస్తువులన్నింటినీ మార్చారు. సాధారణంగా ఒక ముఖ్యమంత్రి వచ్చిన సమయంలో.. కొన్ని మార్పులు చేయడం సహజమే అయినా ఇక్కడ అందుకు భిన్నంగా చేశారు. సీఎంతోపాటు మంత్రులు కూడా వస్తున్నారని మంత్రులు విడిది చేసే చైర్మన్ అతిథిగృహంలోని మంచాలు, సోఫాలు, పరుపులు, బెడ్‌షీట్లు చివరకు చేతులు కడుక్కునే వాష్‌బేసిన్లను కూడా మార్పు చేశారు. దీంతో బిల్లు ప్రస్తుతం తడిసి మోపడైంది. రూ.32 లక్షల భోజన బిల్లులు కాకుండా అదనంగా దేవాలయ పరిధిలో ఫర్నిచర్ కొనుగోలు, పట్టువస్త్రాలు తదితర వాటికి సుమారు రూ.1.4 కోట్లు ఖర్చు అయినట్టు తెలుస్తున్నది. రెండూ కలిపి 1.7 కోట్లకు పైగా ఖర్చు అవడంతో రాజన్న దేవాయలంపై మోయలేనిభారం పడిందని దేవాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు.

అస్పష్ట వివరణ?

'ప్లేట్ భోజనం రూ.32 వేలు?' కథనంపై సోమవారం సాయంత్రం దేవాలయ కార్యనిర్వహణ అధికారి పేరిట రాజన్న సిరిసిల్ల జిల్లా డీపీఆర్వో ద్వారా ఒక ప్రకటన విడుదలైంది. దేవస్థాన అభివృద్ధి పనుల శంకుస్థాపన కోసం ముఖ్యమంత్రి గతనెల 20న వేములవాడకు వచ్చారని, ఆ సమయంలో భోజనాలు, ఇతర ఏర్పాట్ల గురించి నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ వచ్చిన వార్త నిరాధారమని, సత్యదూరమైనదని, దేవాలయం నుంచి ఎటువంటి నిధుల చెల్లింపు చేయలేదని వివరించారు. దేవాలయ నిధులను దేవాదాయ, ధర్మదాయ శాఖ చట్టానికి లోబడి వినియోగిస్తామని, తప్పుడు కథనాల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. రాజన్న ఆలయ సొమ్ము రూపాయి కూడా దుర్వినియోగం చేయలేదని, భవిష్యత్‌లోనూ చేయమని ఆ ప్రకటనలో తెలిపారు.

కథనం వేరు.. వివరణ వేరు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రూ.32 లక్షలతో వంద మంది వీఐపీలకు భోజనాలు పెట్టారని, ప్లేట్ భోజనానికి రూ.32 వేలు ఖర్చు అయినట్టు చూపుతూ సదరు హోటల్ నిర్వాహకులు బిల్లులు పంపించారని, ఆ బిల్లులు దేవాలయం నుంచి చెల్లించడం సాధ్యం కాదని పేర్కొంటూ సంబంధిత అధికారులు కలెక్టర్‌కు ఫైలు పంపారని, ఈ విషయంలో కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలన్న వివరాలను 'నమస్తే తెలంగాణ' కథనంలో నొక్కి చెప్పింది. భోజనాలు, ఫర్నిచర్ కొనుగోలు, ఇతర ఖర్చులు కలిపి రూ.1.7 కోట్లు అయిందని 'నమస్తే తెలంగాణ' తన కథనంలో పేర్కొన్నది. ఎక్కడా రాజన్న ఆలయ నిధులు దుర్వినియోగం ఆయ్యాయన్న పదం వాడలేదు. భోజనాల ఖర్చు రూ.32 లక్షలు అయిందా.. లేదా..? హైదరాబాద్ నుంచి వచ్చిన హోటల్ నిర్వాహకులు బిల్లులు పంపించారా.. లేదా? బిల్లులు దేవాలయం నుంచి చెల్లిస్తారా? లేక కలెక్టర్ ఖాతా నుంచి చెల్లిస్తారా? ప్లేట్ భోజనం అన్నీ ఖర్చులు కలుపుకొని హోటల్ నిర్వాహకులు ఇచ్చిన బిల్లుల ప్రకారం రూ.32 వేలు పడిందా.. లేదా? అనే అంశాలపై దేవాలయ కార్యనిర్వహణ అధికారి పేరిట జారీ చేసిన ప్రకటనలో వివరించకపోవడం గమనార్హం. నిజానికి, 'నమస్తే తెలంగాణ' కథనం తప్పయితే భోజనాలకు ఎంత ఖర్చు పెట్టారో చెప్పాలి. ఆ విషయాన్ని ప్రస్తావించకుండా దేవాలయ శాఖ నుంచి నిధులు చెల్లించలేదంటూ వివరణలో చెప్పారు. కలెక్టర్-దేవాదాయ శాఖ మధ్య పంచాయితీ నడుస్తున్నదని కథనంలో స్పష్టంగా ఉన్నప్పుడు నిధులు చెల్లింపు ప్రస్తావన ఎలా వస్తుందో వివరణ జారీ చేసిన అధికారులకే తెలియాలి. రూ.1.4 కోట్లతో ఫర్నిచర్ కొనుగోలు చేశారని, బెడ్స్ మొదలుకొని అన్నీ మార్చారని, కథనంలో పేర్కొన్న అంశాలపై అధికారులు వివరణ ఇవ్వలేదు. దీంతో అధికారులు దాటవేసేందుకు దారులు వెదుక్కుంటున్నారన్న అభిప్రాయం కలుగుతున్నది.

భద్రాద్రి రామయ్యకు ఆంధ్రా నెయ్యి!

మొదటిపేజీ తరువాయి...

వార్తలొచ్చిన నేపథ్యంలో రాష్ట్ర దేవాదాయ శాఖ అప్రమత్తమై, రాష్ట్రంలోని అన్ని ఆలయాలు విజయ డెయిరీ నుంచే నెయ్యి కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. అయితే ఈ ఏడాది జూన్‌లో భద్రాద్రి దేవస్థానంలో నెయ్యి సరఫరాకు టెండర్లను ఆహ్వానించారు. కాగా, గత పదేండ్ల నుంచి భద్రాద్రి ఆలయానికి నెయ్యి సరఫరా చేస్తున్న కరీంనగర్ డెయిరీ సంస్థ జీఎస్టీతో కలిపి కిలోకు రూ.610కి టెండరు వేసింది. ఆంధ్రలోని పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డిగూడానికి చెందిన రైతు డెయిరీ సంస్థ రూ.534.24కు టెండర్ వేసి కాంట్రాక్టు దక్కించుకుంది. ప్రధాన ఆలయాలకు రెండేండ్లపాటు నెయ్యి సరఫరా చేసిన అనుభవం, ఏడాదికి రూ.10 కోట్ల టెండర్లు వేసి ఉండాలన్న నిబంధనలో రైతు డెయిరీ సంస్థ అర్హత సాధించలేదు. అవచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు నెయ్యి సరఫరా చేసే విధంగా సదరు ప్రైవేటు డెయిరీతో ఒప్పందం చేసుకున్నారు. దీనిపై విమర్శలు వ్యక్తం కావడంతో దేవాదాయశాఖ దేవాదాయశాఖ చర్యలకు ఉపక్రమించింది.

భద్రాద్రిలో లడ్డూ తయారిని పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ (ఫైల్)

కాంట్రాక్టు రద్దు.. ఈవోపై చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): విజయ డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరుచేస్తూ భద్రాద్రి ఆలయ అధికారులు ప్రైవేటు డెయిరీకి కాంట్రాక్టును కట్టబెట్టడంపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఆలయ ఈఓపై చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ కమిషనర్‌ను ఆదేశించారు. రాష్ట్రంలోని ఏదైనా ఆలయంలో ఇటువంటివి జరిగి ఉంటే సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. విచారణ నిర్వహించి బాధ్యులప